## క్లుప్తంగా

### సంఘటితంగా పోరాటాలు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఆటో కార్మికుల సమస్యలపై సంఘటితంగా పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆటో కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. పోలీసులు ఈ-చలానాల పేరుతో ఆటో కార్మికులను వేధిస్తున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సుబ్బరాయుడు, నారాయణ, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

### వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : పశు సంవర్ధకశాఖలో ఖాళీగా ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.చిన్ని, శివకుమార్‌లు కోరారు. సోమవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 20న విద్యుత్ సంస్కరణలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పెను మార్పులు జరుగుతున్నాయని, ప్రజలపై భారాలను మోపేందుకు సిద్ధం అవుతున్నాయని వాటిని వ్యతిరేకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలను చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్లన విద్యుత్ రంగం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలపై వామపక్ష పార్టీలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ సిటీప్లానర్ సూరజ్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్‌గా నియమితులైన సూరజ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో కడప కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఏసీపీ నాగేంద్ర, టీపీఎస్ చంద్ర, సూపరింటెండెంట్ శివకుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

### కృష్ణయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరులో అగ్రకులాల వారి దాడిలో ఇటీవల మృతి చెందిన జంజాల కృష్ణయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కోరారు. సోమవారం కలెక్టర్ విజయరామరాజును కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. మృతుని కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియాతోపాటు ఆ కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు.

### 23 నుంచి వైవీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం

వైవీయూ : వైవీయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఈనెల 23 నుంచి 2, 4, 5, 6 సెమిస్టర్ల పరీక్షలు (రెగ్యులర్, బ్యాక్‌లాగ్) ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా జూలై 20వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. 42,128 మంది విద్యార్థులు 57 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

### రేపు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : కడప నగరం జయనగర్‌కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈనెల 21వ తేదీ ఉదయం 6 గంటలకు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ బాలుర జూనియర్ విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ది న్యూ వైఎస్‌ఆర్ కడప బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రహాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించే 1వ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలన్నారు.

### తిరుపతి-హైదరాబాదు మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతి-హైదరాబాదు-తిరుపతి (07643/44)మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నామని రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. హైదరాబాదు-తిరుపతి మధ్య ప్రతి సోమవారం, తిరుపతి-హైదరాబాదు మధ్య ప్రతి మంగళవారం వారానికి ఒకరోజు ఈ రైలు నడుస్తుందన్నారు. జులై 3వ తేదీ నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు ఈ రైళ్లు నడుస్తాయన్నారు. ఈ రైలు ఆయా రోజుల్లో తిరుపతిలో సాయంత్రం 3 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5 గంటలకు హైదరాబాదు చేరుతుందన్నారు. హైదరాబాదులో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10 గంటలకు తిరుపతికి చేరుతుందన్నారు.

## సమాజానికి హాని కల్గించే కేసుల్లో అప్రమత్తంగా ఉండాలి






రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జిల్లా సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న కడప న్యాయవాదుల సంఘం, పాల్గొన్న న్యాయవాదులు

కడప అర్బన్ : సమాజానికి హాని కల్గించే గంజాయి, ఎర్రచందనం, పోక్సోవంటి కేసుల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పూర్తిగా కేసులను స్టడీచేసి వాటిపైన అవగాహన పొంది, కోర్టుల్లో కేసులను వాదించి శిక్షలు పడేలా కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జిల్లా సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద వున్న ×పెన్నార్⁑ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లావ్యాప్తంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల వాదనలు విషయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అన్ని చట్టాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ప్రతి వ్యక్తి కేసులో వాదనలలో ని ష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ప్రాసిక్యూషన్‌కు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మంచిపేరును తీసుకురావాలన్నారు. కాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమీక్షలో జాయింట్ డైరెక్టర్ ఖదీరున్నీసా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ కుమార్ రెడ్డి, ప్రత్యేక పి.పిలు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

**ఘనంగా సన్మానం** : కడప జిల్లా కోర్టు ఆవరణలో వున్న కడప న్యాయవాదుల సంఘం భవనంలో సోమవారం సాయంత్రం ఏపీ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జిల్లా సుదర్శన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. గాలివీడు మండలం నూలివీడు నుంచి కడపకు వచ్చిన ఆయన న్యాయవాదిగా అంచెలంచెలుగా ఎదిగారని న్యాయవాదులు కొనియాడారు. కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.వి రాఘవరెడ్డి, కెన్నడితో పాటు, సీనియర్ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## వైవీయూలో నూతన వేమన విగ్రహం ఆవిష్కరణ



వైవీయూలో పునఃప్రతిష్ఠించిన వేమన విగ్రహం వద్ద వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన వేమన విగ్రహం పునః ప్రతిష్ఠమహోత్సవ కార్యక్రమం సోమవారం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ వేమన విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ తెలుగువారందరికీ పరిచయం ఉన్న గొప్పవ్యక్తి వేమన అన్నారు. సమాజంలోని రుగ్మతలపై పద్యం అనే బాణాలను ఎక్కుపెట్టి ప్రజలను చైతన్యం చేసిన సహజకవి అన్నారు. వేమన విగ్రహం ఎత్తుపెంపుపై వచ్చిన వినతులను రిజిస్ట్రార్ తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సుందరీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామీణ ప్రాంతంలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడమే కాకుండా, వేమన పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. అంతకు మునుపు వైవీయూలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పుత్తా పద్మ, ఇంజినీర్ రాజశేఖరరెడ్డి, రామచంద్రారెడ్డి, వివిధ విభాగాల డీన్లు, ఆచార్యులు, సహ, సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కడప కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర పర్యాటకశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లయిడ్ న్యూట్రిషియన్ సంస్థలో కోర్సులు అభ్యసించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ అడ్మిషన్స్ విభాగం కో ఆర్డినేటర్ కె.శివరామకృష్ణ, అధ్యాపకుడు పి.మోహన్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని హరిత హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. 2023-24 సంవత్సరానికిగాను బీఎస్సీ మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్మీడియేట్‌లో 45 శాతానికి పైగా మార్కులు సాధించిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. సంస్థ దరఖాస్తులు, ఇతర పూర్తి సమాచారం కోసం అడ్మిషన్ కో ఆర్డినేటర్ కె.శివరామకృష్ణ (9700440604, 97013 43846)ను సంప్రదించాలని సూచించారు. అలాగే డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.ఎస్ఐహెచ్ఎంటీపీటీ.ఓఆర్‌జీ నుంచి దరఖాస్తులను పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను జులై 5వ తేదీలోగా కళాశాల చిరునామాకు పంపాలని సూచించారు.

## కడప రైతు బజార్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కడప అగ్రికల్చర్ : కడప రైతు బజార్‌ను ఆంధ్రప్రదేశ్‌లోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని రైతు బజార్ల రాష్ట్ర సీఈఓ నందకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కడప రైతు బజార్‌ను మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయలు, ఏడీ ఆజాద్‌వల్లిలతో కలిసి పరిశీలించారు. దెబ్బతిన్న టైల్స్‌తోపాటు చీలిన రేకులను పరిశీలించారు. రైతు బజార్‌లోని సమస్యలను షాపుల యజమానులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన రైతు బజారు అభివృద్ధికి రూ. 20 మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ సంతోష్‌కుమార్, రైతుబజార్ మేనేజర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రైతు బజార్‌లో దళారీ వ్యవస్థను నిర్మూలించాలి**

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని రైతు బజార్‌లో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు రైతు బజార్ల సీఈవో నందకిషోర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప రైతు బజారులో రైతులు మాత్రమే ఉండాలన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టి అధిక ధరలకు అమ్ముతున్న కిరాణా షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు స్టాల్స్‌ను కేటాయించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీ, లైటింగ్ సమస్యలను పరిష్కారించాలని కోరారు.

## సచివాలయ ఏఎన్‌ఎంల షిఫ్టింగ్ అన్యాయం

కడప సెవెన్‌రోడ్స్ : పనితీరు సక్రమంగా లేదంటూ తమకు షిఫ్టింగ్ ఆర్డర్లు ఇవ్వడం అన్యాయమని సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్‌కు ఈ మేరకు వారు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లాలో 57 మంది ఏఎన్‌ఎంలను అన్యాయంగా షిఫ్టులు చేశారన్నారు. తాము 42 రకాల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. అయితే అందులో రెండు రకాల విధులను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని పనితీరు బాగా లేదంటూ షిఫ్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు. ఇంతవరకు తమలో చాలా మందికి పై అధికారుల నుంచి మూడు వార్నింగ్ లెటర్లు, ఒక మెమో, షోకాజ్ గానీ ఇవ్వకుండా నేరుగా షిఫ్టింగ్ చేయడం తగదన్నారు. గర్భవతుల రిజిస్ట్రేషన్‌లో సాంకేతిక సమస్యల వల్ల లక్ష్యాలను చేరుకోలేక పోతున్నామని తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి గర్భవతిని నమోదు చేస్తూనే ఉన్నామన్నారు. వీఎన్ పల్లె ఏఎన్‌ఎం గీతను అసభ్య పదజాలంతో దూషించిన వైద్యునిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి

కడప కల్చరల్ : రాష్ట్రంలోని మైనార్టీల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. సోమవారం ఆయనను స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని వైఎస్సార్ సీపీ నాయకులు సుబాన్ బాష కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మైనార్టీలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను గురించి ఆయనకు విన్నవించారు. స్పందించిన ఆయన మైనార్టీలు న్యాయ, చట్టపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు లబ్ధి పొందేలా కృషి చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో పర్యటిస్తున్నామని, అన్ని సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి మైనార్టీల సంక్షేమం, ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షంషీర్, అక్బర్ అలీ, గుంతమసీదు మౌల్వి సాహెబ్ ఖలీలుల్లా, మన్సూర్, తన్వీర్, షబ్బీర్, రియాజ్, బాబు అలీ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పౌరులుగా తయారు చేయడమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేయడమే ఏకలవ్య ఫౌండేషన్ లక్ష్యమని విద్యాకమిటి సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రంలో విద్యావికాసం కేంద్రాల నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఒక దేశం అభివృద్ధి చెందడంలో విద్య అనేది ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణుడు, ఫౌండేషన్ ట్రస్టీ చలపతి మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జయదేవ్, జిల్లా ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ నరేష్, నాగార్జున అకౌంటెంట్స్ వీరాంజనేయులు, వెంకటరత్నం, చెన్నారెడ్డి, ప్రసన్న, పవన్ వికాస కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎర్త్‌సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్‌సైన్స్ విభాగంలో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ అప్‌లైడ్ జియాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశాలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోపు ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్, ఇతర సందేహాలకు శశికుమార్ నాయక్ సెల్‌నెంబర్ 8985597928, మురళీధర్‌రెడ్డి 9985442196 నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

### పండ్లు పంపిణీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నగరంలోని స్నేహాలయ నిరాశ్రయుల వసతి గృహంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, ఓబులేసు, గౌసియా పాల్గొన్నారు.

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సహాయ కార్మిక అధికారి పాల్ జాన్సన్ తెలిపారు. కడప నగర శివార్లలోని పలు షాపులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల కార్మికులతో పనిచేయిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నిబంధనలను పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఫీజుల నిబంధనలను పాటించని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కడప గీతాంజలి జూనియర్ కళాశాలలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర నాయకత్వ శిక్షణా తరగతులను ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు చదువు అందుబాటులో ఉండాలని ఫీజుల నిబంధన పెట్టినా రాష్ట్రంలో ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్‌తోపాటు పలు జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

### మేము సైతం ఆధ్వర్యంలో ఇద్దరికి అంత్యక్రియలు

కడప అర్బన్ : మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం కడప రిమ్స్ మార్చురీ నుంచి రెండు మృతదేహాలకు అంత్యక్రియలను నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అలాగే రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద చనిపోయిన వ్యక్తికి మేము సైతం సేవాసంస్థ వారు ముందుకు వచ్చి వారికి అంత్యక్రియలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి గుండ్లకొండ రవి, అధ్యక్షుడు వంకధారి రాము, అయ్యవారయ్య, రెడ్డెయ్య, గురవయ్య, దామోదరం, సివిల్ సప్‌లైస్ సురేష్, రామలోకం మొదలగు వారు పాల్గొన్నారు.

### కార్పొరేషన్ ఎదుట ధర్నా

కడప కార్పొరేషన్ : మున్సిపల్ రంగంలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. వేణుగోపాల్, ఎల్. నాగసుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ విధానం లోపభూయిష్టంగా ఉందని, కార్మికుల వేతనాల నుంచి కోత పెట్టిన ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు సక్రమంగా జమ కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులుఏ కేసీ బాదుల్లా, గున్నా గోవిందు, జాన్ పాల్గొన్నారు.

### దొంగ అరెస్ట్

కడప అర్బన్ : కడప రిమ్స్ ఆవరణంలో పార్క్ చేసి వుంచిన హోండా షైన్ ద్విచక్రవాహనాన్ని దొంగిలించిన చింపిరి వెంకటేష్ అనే దొంగను సోమవారం కడప రిమ్స్ పిఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని రికవరీ చేశారు.

### అన్నదానం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన కృపా కాలనీలోని న్యూ నేటివ్ కృప ప్రార్థనా మందిరంలో సోమవారం పాస్టర్ పి.మహేష్ మనవడు అగస్టీన్ పుట్టిన రోజును పురస్కరించుకుని పేదలకు అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మలు ఈ సందర్భంగా ప్రజలందరిపై ఏసుక్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రవితేజ, దాస్, రోజా, లీలావతి, శాంతిరాజు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## యోగ సాధనతో ఆరోగ్యం



వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

కడప స్పోర్ట్స్ : యోగ సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సింగం మురళిబాబు సూచించారు. సోమవారం కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా యోగపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యునాని వైద్యులు డా. ఎస్ఎండీ హయత్, యోగ శిక్షకులు పెంచలప్రసాద్, నాగజ్యోతి, లక్షుమయ్య, సుమంత్ పాల్గొన్నారు.

**ఆర్ట్స్ కళాశాలలో..**

ప్రభుత్వ పురుషుల కళాశాలలో సోమవారం యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడారు. యోగ శిక్షకుడు ఆదినారాయణ యోగ విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం యోగ ఆసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. అంకాల్ నాగరాజు, శివరామకృష్ణ, డా. వై. సావిత్రి పాల్గొన్నారు.

**వారసత్వ ప్రదేశంలో యోగా డే**

కడప కల్చరల్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచమంతటా ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నారు. ముందస్తు కార్యక్రమంలో భాగంగా కడప నగరానికి చెందిన మిత్ర యోగాసొసైటీ పర్యాటక క్షేత్రమైన పుష్పగిరిలో యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు, మిత్ర యోగా సొసైటీ నిర్వాహకులు, యోగా థెరపిస్టు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఉదయం 6 గంటలకే సంస్థల సభ్యులు పుష్పగిరి క్షేత్రానికి చేరుకున్నారు. ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులతోపాటు పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ స్మారక ట్రస్టు అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, సభ్యులు, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, సభ్యులు పుష్పగిరి ధర్మ పరిరక్షణ సేన ప్రతినిధి సట్టి భారవి ఆసనాలు వేశారు.

## 'స్పందన' అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ సూచించారు. సోమవారం కార్పొరేషన్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 53 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం - 16, టౌన్ ప్లానింగ్ - 17, రెవెన్యూ విభాగం - 6, హెల్త్ విభాగం - 3, యూపీఏ విభాగం - 3, హౌసింగ్ - 2, సీకే దిన్నె తహసీల్దార్ - 3, కడప తహసీల్దార్ - 2, డీఈఓ - 1 వచ్చాయి. వీటిని గడువులోగా పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏపీపీ నాగేంద్ర, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ భరత్ కుమార్ పాల్గొన్నారు.

## రూ.2 కోట్లతో మైక్రో కంపోస్టింగ్ సెంటర్లు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వెలువడే తడిచెత్తను మైక్రో కంపోస్టింగ్ చేయుటకు రూ.50 లక్షలతో నాలుగు సెంటర్ల నిర్మాణానికి నగరపాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. సోమవారం సాయంత్రం మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సౌత్, ఈస్ట్, నార్త్, వెస్ట్ జోన్లలో వీటిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వీధి దీపాల మరమ్మతుల కోసం రూ.38 లక్షలతో కొత్త స్కై లిఫ్ట్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా ఉన్న ఐలాండ్‌ను రూ.92 లక్షలతో సుందరంగా తీర్చిదిద్దుటకు నిర్ణయించారు. అందుకు రూ.23లక్షలు జనరల్ ఫండ్ ఉపయోగించాలని తీర్మాణించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెండవ గాంధీ బొమ్మ నుంచి రామక్రిష్ణ జూనియర్ కాలేజీ వరకూ ఉన్న రోడ్డును 55 అడుగుల మేర విస్తరించేందుకు ప్రతిపాదించారు. ఇందులో నష్టపోయే 9 మందికి రూ.41.75లక్షలను జనరల్ ఫండ్ ద్వారా నష్ట పరిహారం కింద ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ సర్కిల్‌ను ఆధునీకరించాలి**

కడప ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఉన్న బీఆర్ అంబేద్కర్ సర్కిల్‌ను ఆధునీకరించాలని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు కోరారు. సోమవారం వారు మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పులి సునీల్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని 15 అడుగులకు పెంచాలని, కొత్త డిజైన్‌తో రెయిలింగ్, పచ్చదనం ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, కార్పొరేటర్లు కె. బాబు, చెన్నయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ మాస్టర్ వీవర్లు, చేనేత సొసైటీల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు. నేతన్న నేస్తం కింద రూ. 24 వేలు ఆర్థికసాయం చేస్తున్నారని, ఆ పథకాన్ని నేతన్నలందరికీ వర్తింపజేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వార్షిక బడ్జెట్‌లో చేనేత రంగానికి కేటాయింపులు పెంచాలన్నారు. నూలు, పట్టు, జరి, రంగులు, రసాయనాల ధరలు 2021 నాటి స్థాయికి తగ్గించాలన్నారు. ఆప్కో ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకులు కాటా రామదాసు, జిల్లా అధ్యక్షులు చెన్నా రామయ్య, కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ, బి.ఓబయ్య, నూకల పెంచలయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

## ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ జోన్ పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులపతి, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డిలు కోరారు. కడప రీజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీల పదోన్నతులు, బదిలీలను విజయవంతంగా నిర్వహించిన ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డిని సోమవారం కలిసి పూలగుచ్చంతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఈఓ -2 పోస్టుల పదోన్నతులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించారని కొనియాడారు. అలాగే ఉపాధ్యాయుల సర్వీసు సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సంబంధిత సమస్యలకు సంబంధించి ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రాజమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా ప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.